క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష శిబిరం

నారాయణవనం: నారాయణవనం-1 సచివాలయ పరిధిలో గురువారం ఉదయం 8.30 గంటల నుంచి జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. ముఖ్య అతిథిగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని చెప్పారు.

మురుగు కాలువలు శుభ్రం చేయరా?



కాలువల్లో నిల్వ ఉన్న మురుగునీరు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తొట్టంబేడు పంచాయతీలోని సాయిబాబా గుడి దగ్గర, తొట్టంబేడు సచివాలయం ముందు మురుగు కాలువల వద్ద పారిశుధ్యం పడకేసింది. మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్గంధం చిమ్ముతోంది. దోమలమోత పెరుగుతోంది. వీటిని శుభ్రం చేసిన పాపానపోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు వీటిపై దృష్టి సారించి పారిశుధ్యం సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బంగారు మాంగల్యం సమర్పణ



బంగారు మాంగల్యాన్ని అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: పట్టణంలో పీవీరోడ్డులోని అంకాలమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన సింధే శ్యామల, లక్ష్మీ నరసింహారావు దంపతులు, గుమ్మలపు వినీత, యశ్వంత్ దంపతులు బుధవారం రూ.12వేల విలువ గల బంగారు మాంగల్యాన్ని సమర్పించారు. దీనిని ఆలయ కమిటీ నిర్వాహకులు స్వీకరించారు. అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయాధికారి భారతి పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, పచ్చిరొట్ట విత్తనాల వల్ల భూమిలో సత్తువ పెరుగుతుందన్నారు. 50 శాతం రాయితీపై 10 కేజీల జీలగలు రూ.395, 10 కేజీల జనుములు రూ.420 లకు, 10 కేజీల పిల్లిపెసర రూ.485 లకు బయోమెట్రిక్ విధానంలో రైతులకు ఇస్తామన్నారు. ఇవి కావలసిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకురావాలన్నారు. అలాగే పీఎం కిసాన్‌కు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సురుటుపల్లె దేవస్థానం ట్రస్టు సభ్యులు అజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీఈఓ రేవతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల అనుగ్రహంతోనే సుభిక్షం



జాతర వేడుకల్లో అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: గ్రామ దేవతల అనుగ్రహంతోనే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. మండలంలోని జగ్గరాజుపల్లెలో గ్రామదేవత పోలేరమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. అంజూరు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతర కమిటీ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ ఈశ్వరయ్య, సర్పంచ్ సాగీర్‌బీ, ఉప సర్పంచ్ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎల్ఐసీ రీజినల్ మేనేజర్



ధ్వజస్తంభం వద్ద ఎల్ఐసీ రీజినల్ మేనేజర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం ఎల్ఐసీ రీజినల్ మేనేజర్ రమేష్‌బాబు కుటుంబ సమేతంగా, గీత గోవిందం సినిమా దర్శకులు పరశురామ్ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణమూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, ఎల్ఐసీ అధికారులు థామస్, లిక్రిచూర్, వెంకటేశ్వర్లు, వెంకటముని పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో..



చిత్రంలో బియ్యం ప్యాకెట్లను సిద్ధం చేస్తున్న గ్రామ వలంటీర్ పేరు జయసూర్య. ఆయన యానాదివెట్టు పంచాయతీ. కోవూరుపాడు గ్రామ వలంటీర్‌గా సేవలందిస్తున్నాడు. కోవిడ్ సమయంలో కోవూరుపాడు గిరిజనులకు నిత్యావసర సరుకులు, బియ్యం వితరణగా ఇచ్చేందుకు హీరో పరిశ్రమ ముందుకొచ్చింది. పరిశ్రమ ఇచ్చిన బియ్యం, నిత్యావసర సరుకులను తానే స్వయంగా వేరు చేసి కుటుంబాల వారీగా పంపిణీ చేశారు. సేవా దృక్పథంతో వలంటీర్ సేవలకు అటు పరిశ్రమ యాజమాన్యం, గిరిజనులు అభినందించారు.

–జయసూర్య

సేవకు సలాం

వరదయ్యపాళెం: ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తక్షణమే సచివాలయ, గ్రామ వలంటీర్ల వ్యవస్థలను తెచ్చారు. ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ వలంటీర్లు నాటి నుంచి ఎనలేని సేవందిస్తున్నారు. ప్రత్యేకించి, కోవిడ్ మహమ్మారి అతలాకుతలం చేస్తున్న అప్పటి పరిస్థితులలో ప్రాణాలను లెక్కచేయకుండా రోగుల ఇళ్లకు వెళ్లి వారి అవసరాలను తీర్చారు. ఇతర రాష్ట్రాలు, జాతీయ ఛానళ్లు సైతం వీరి సేవలను ప్రస్తుతించాయి. సదాశయంతో తెచ్చిన ఈ వ్యవస్థపై ఇప్పుడు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై సేవా సైన్యం భగ్గుమంటోంది. సత్యవేడు నియోజకవర్గంలోని 96 గ్రామ సచివాలయాల పరిధిలో 1453 మంది గ్రామ వలంటీర్లు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి సేవలపై కథనం.

ఇంటి ముంగిటకే పథకాల ఫలాలు



ప్రభుత్వ పథకాలు గ్రామ వలంటీర్ ద్వారా అందుతున్నాయి. ఒంటరి మహిళగా ఉన్న నాకు వితంతు పింఛన్‌ను ప్రతి నెలా ఒకటో తేదీ నేరుగా ఇంటి వద్దే వలంటీర్ ద్వారా అందుకుంటున్నాను. పూరి గుడిసెలో ఉన్న నాకు పక్కా గృహాన్ని వలంటీర్ ద్వారానే మంజూరు చేయించారు. కోవిడ్ సమయంలో నిత్యావసర సరుకులు ఇంటికే తెచ్చిచ్చారు. నాలాంటి వృద్ధాప్యంలో ఉన్న వారికి వలంటీర్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతోంది.

–కె. దేశమ్మ, కోవూరుపాడు, వరదయ్యపాళెం

టీడీపీ పాలనలో పింఛను పాట్లు



ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు రాజయ్య. ఆయన స్వస్థలం వరదయ్యపాళెం మండలం రాచర్ల దళితవాడ. కొన్నేళ్ల క్రితం పక్షవాతానికి గురై ఆయన మంచానికే పరిమితమయ్యాడు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో రాజయ్య పింఛన్ కోసం 5 కిలోమీటర్ల దూరంలోని కంచరపాళెం పోస్టాఫీసుకు ఇబ్బందుల నడుమ వెళ్లి తీసుకోవాల్సిన వచ్చేది. అక్కడికి వెళ్లేందుకు ఆయనకు ఒక మనిషి తోడు, రూ. 200 చెల్లించి అద్దె ఆటో తీసుకుని వెళ్లకతప్పేది కాదు. వైఎస్సార్ సీపీ పాలనలో ఆ కష్టాలు పడవలసిన అగత్యం తప్పింది. ప్రతినెలా ఠంచనుగా ఒకటో తేదీ తెల్లవారుజామునే స్థానిక వలంటీర్ జాన్సీ ఇంటికి వెళ్లి ఫించన్ ఇస్తోంది. ఇంటి ముంగిటకే పింఛను అందుతుండడంతో ఆయనకు ఎంతో ఊరట లభిస్తోంది.



చిత్రంలో బ్లీచింగ్ చల్లుతున్న యువకుడి పేరు రియాజ్. ఇతడు వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలోని బీసీ కాలనీకి గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. కోవిడ్ సమయంలో ఆ ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా ప్రకటించారు. దీంతో ఎవరూ ఆ వైపు అడుగు పెట్టని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో స్వచ్ఛందంగా ఆ ప్రాంతాల్లో రోజూ బ్లీచింగ్ పౌడర్ చల్లి సేవలు అందించాడు. అలాగే కరోనా జాగ్రత్తలు పాటిస్తూనే పీడితుల అవసరాలు తెలుసుకుని వాటిని తీర్చాడు. కులం లేదు..మతం లేదు..సేవాభావమొక్కటే అతనికి గుర్తింపుతెచ్చింది. ఫలితంగా సేవలు పొందిన కుటుంబాలు అతడినీ తమ కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నాయి.

కేంద్రమంత్రికి ఎమ్మెల్యే సన్మానం



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ గురుమూర్తి

రేణిగుంట: మండలం కొత్తపాళెం సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. వేదికపై ఆయన్ను తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలసి ఎమ్మెల్యే కలంకారీ వస్త్రంతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. జాతీయ రహదారుల వెంబడి నాటే మొక్కల్లో ఆయుష్, ఆయుర్వేద మొక్కలను పెంచి భవిష్యత్తు తరాలకు ఆయుర్వేద ఫలాలను అందించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నితిన్ గడ్కరీపై అత్యంత విశ్వాసం ఉందని, ఆయన కోరిన వెంటనే 100శాతం పనులు చేసిపెడతారన్న పేరుందన్నారు.

మొక్కలు నాటిన కేంద్ర మంత్రి, స్కౌట్స్ విద్యార్థులు



మొక్కలు నాటుతున్న స్కౌట్స్ విద్యార్థులు

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన జాతీయ రహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరీ బుధవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆయనకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి స్వాగతం పలికారు. అనంతరం మండలంలోని కొత్తపాళెం గ్రామం వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా వారు మొక్కలు నాటారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ పురస్కరించుకుని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కేంద్రమంత్రి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించింది. అలాగే తిరుపతి, తిరుచానూరు నుంచి 200మంది సౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొని మొక్కలు నాటారు. స్కౌట్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిషనర్ కోటేశ్వరరావు, మాస్టర్లు వెంకటేశు, అజారుద్దీన్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రాసరాయరాయుడు

ఏర్పేడు: ఉపాధి హామీ హామీ కూలీలకు రోజుకు రూ. 272 వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలని అంబుడ్స్‌మెన్ రాసరాయరాయుడు అన్నారు. బుధవారం మండలంలోని ఇసుకతాగేలిలో ఉపాధిహామీ పనులను తనిఖీ చేశారు. కూలీల హాజరు పరిశీలించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిట్టుబాటు కూలీ రాలేదని కూలీలు ఆయన దృష్టికి తీసుకుని పైవిధంగా స్పందించారు. రాళ్లతోకూడిన గట్టి ప్రాంతాల్లో కాకుండా మెత్తని ప్రాంతాల్లో పనులు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో మామిడి, పూలు, మునగ తోటలను సాగు చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో వంద మంది కూలీలు పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈసీ బాలాజీరావు, సాంకేతిక సహాయకుడు మనోహర్, క్షేత్ర సహాయకురాలు లీలావతి పాల్గొన్నారు.

భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాలదే

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

తిరుపతి రూరల్: డీజిల్, ఇంధన ముడి చమురు వాడకాన్ని తగ్గించి పర్యావరణానికి మేలు చేసే ఎలక్ట్రిక్ వాహనాలదే రానున్న భవిష్యత్తు అని కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. తిరుపతిలో బుధవారం సాయంత్రం బెంగళూరు–తిరుపతి మార్గంలో ఫ్రెష్ బస్సు ఈవీ బస్ ఫ్లీట్‌ను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహనాల రాకతో కాలుష్యం తగ్గుతుందన్నారు. ఎలక్ట్రిక్ ఫ్లీట్ ఇంటర్ సిటీ ట్రావెల్‌కి పచ్చజెండా ఊపడం అభినందనీయమన్నారు. ఫ్రెష్ బస్సు హరిత భారత దేశం దిశగా ముందడుగు వేస్తుందని ఫ్రెష్ బస్సు వ్యవస్థాపకుడు సుధాకర్‌రెడ్డి చిర్రా తెలిపారు.

జగనన్న సురక్షతో సంక్షేమ ఫలాలు





పొయ్యిలో ధృవపత్రాలు అందజేస్తున్న పవిత్రారెడ్డి, ఎంపీపీ నిర్మలమ్మ, ఏర్పేడు: రావిళ్లవారికండ్రిగలో..

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): జగనన్న సురక్షతో అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు, అవసరమైన సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రా రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పొయ్య, పెద్దకన్నలి సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. పొయ్యలో 848, పెద్దకన్నలిలో 569 వివిధ ధృవ పత్రలను అందజేసి ఆమె మాట్లాడారు. ఒకప్పుడు సమస్యలు నివేదించాలన్నా అధికారులు, నాయకులు అందుబాటులో ఉండేవారు కాదని, వైఎస్సార్ సీపీ పాలనలో అధికారులే ఇళ్ల ముంగిటకు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పొయ్య గ్రామస్తుల వినతిపై ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి స్పందించి గ్రామంలో పాల కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, అలాగే దాదాపు రూ.6 కోట్లతో సింగమాల, పొయ్య, కొమ్మనగుంట గ్రామాలను కలుపుతూ లింక్ రోడ్డును వేయించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడు, వైస్ ఎంపీపీ కన్నలి మాల్లికమ్మ, గెరటా రెడ్డి, తహసీల్దార్ సుధీర్ రెడ్డి, సర్పంచ్ నక్కుబాయమ్మ, మాధవి, వీరభద్ర, మోహన్, సునీత, కొన్నలి రమేష్, సుబ్రమణ్యం యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట, రావిళ్లవారికండ్రిగ గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హులకు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి వివిధ ధృవపత్రాలను అందజేసి మాట్లాడారు. జెడ్పీటీసీ తిరుమలయ్య, వైస్ ఎంపీపీలు తిరుపతి జనార్ధన్‌రెడ్డి, జమ్మల శ్రీనివాసులు, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్ధన్ యాదవ్, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సర్పంచులు లలిత, రాధాకృష్ణ వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణయ్య యాదవ్, మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, పలువురు పార్టీ నాయకులు, తహసీల్దారు శివప్రసాద్, ఎంపీడీఓ గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కీళపూడిలో..

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడి సచివాలయంలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరై సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారని తెలియజేశారు.

వలంటీర్ల నిరసన



గాజులమండ్యంలో ర్యాలీ చేస్తున్న వలంటీర్లు

- పవన్ కళ్యాణ్ చిత్రపటం దహనం

రేణిగుంట: గ్రామ వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గాజులమండ్యం వలంటీర్లు బుధవారం నిరసనగా ర్యాలీ నిర్వహించారు. పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వానికి–ప్రజలకు వారధిగా తాము నిబద్ధతతో సేవ చేస్తుంటే, జనసేన అధినేత దుర్బుద్ధితో కువిమర్శలు చేయడం ఎంతమాత్రమూ తగదని ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు ఆందోళన, నిరసనలు చేస్తున్నా పట్టించుకోకుండా మరింత ఆజ్యం పోసేలా వ్యాఖ్యలు చేస్తూండటం ఎంతమాత్రమూ క్షమార్హం కాదని మండిపడ్డారు. తన మాట బలంగా తాకడం వల్లే ఆందోళనలు చేస్తున్నారని ఆయన సమర్థించుకోవడం చూస్తే ఎంత అజ్ఞానో ఇట్టే తెలుస్తోందన్నారు. ఆయన భేషరతుగా క్షమాపణ చెప్పకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వారు పవన్ చిత్రపటాన్ని చించి తగులబెట్టారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి



శ్రీనివాసపురంలో స్విచ్ఛాన్ చేసి బోర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని ఆరె సచివాలయ పరిధిలోని గ్రామాలలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రతి కుటుంబాన్ని పలకరించి వారికి అందిన లబ్ధి వివరాలను బుక్‌లెట్లతో తెలియజేశారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు.

రెట్టింపు ఉత్సాహంతో 'జగనన్న సురక్ష'

ఆరె గ్రామంలో ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ధనంజయరెడ్డి ఇంటి వద్ద ఎమ్మెల్యే కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు, నాయకులు మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను, ఆ పథకాలకు కావాల్సిన ధృవపత్రాలను ఇచ్చేందుకు చొరవ చూపాలన్నారు. వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని వారికి క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

శ్రీనివాసపురంలో తీరిన తాగునీటి కష్టాలు

మండలంలోని శ్రీనివాసపురం ప్రజలు ఏడేళ్లుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. గత నెలలో గడప గడపకు కార్యక్రమంలో సమస్యను ఎమ్మెల్యేకు నివేదించారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వ నిధులతో రెండు బోర్లను ఏర్పాటు చేశారు. వాటిని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ మునెమ్మ, ముఖ్యనేతలు నందకుమార్, లాలుబాబు యాదవ్, సుబ్బన్న, అయ్యప్పరెడ్డి, గిరి, హరిబాబు, బాల సుబ్రహ్మణ్యం, బొబ్బిలి నాగరాజు, మూర్తి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సీపీలో టీడీపీ యువనేత చేరిక



మునిశేఖర్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని రాగిగుంటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి కుమారుడు మునిశేఖర్ బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్ఆర్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వగత్తూరులో జరుగుతున్న జాతరలో ఎమ్మెల్యే పాల్గొని రూ.5వేల విరాళమిచ్చారు.

కుష్టు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం

- అడిషనల్ డీఎంహెచ్ఓ అరుణ సులోచనదేవి



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ అరుణ సులోచనదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: కుష్టు వ్యాధిని పూర్తిగా రూపు మాపి, 2030వ సంవత్సరానికి కుష్టు రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని తిరుపతి జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ అరుణసులోచనదేవి పిలుపునిచ్చారు. బుధవారం ఆమె స్థానిక పీహెచ్‌సీలో కుష్టు వ్యాధి ఇంటింటి సర్వేపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, జూన్ 26 నుంచి జూలై 25వ తేదీ వరకు ఈ సర్వే చేస్తున్నామన్నారు. సర్వేను పక్కాగా చేయాలన్నారు. ఆశా కార్యకర్త, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి ఇంటిలోని సభ్యులకు ఎవరికైనా నొప్పిలేని మచ్చలుంటే స్థానిక పీహెచ్‌సీలోని వైద్యులతో పరీక్షలు చేయించాలన్నారు. కుష్టు అని నిర్ధారణ అయితే వారికి ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం మందులను ఇస్తుందని, వాటిని వైద్యుల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా వాడితే వ్యాధి నుంచి పూర్తిగా విముక్తి పొందవచ్చన్నారు. అనంతరం సర్వే రికార్డులను పరిశీలించారు. మండలంలో 75 శాతం వరకు కుష్టు సర్వే పూర్తి చేశామని, ఒక కేసును గుర్తించినట్లు పీహెచ్‌డీ వైద్యాధికారి దివాకర్ తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ తిరుజ్ఞానం, వైద్యాధికారి దివాకర్, సీహెచ్ఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సిపాయి భరోసా పంపిణీ



మృతుని కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని దుర్గిపేరికి చెందిన దొడ్డి రవికుమార్(47) ఇటీవల మృతి చెందాడు. బుధవారం గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పరామర్శించారు. సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడా 40 రకాల నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాబూరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దశరథరామిరెడ్డి, మునిరెడ్డి, మునిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ డాక్టర్లకు వీడ్కోలు సన్మానం



డాక్టర్లను సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

సత్యవేడు: ఉద్యోగపరంగా బదిలీలు తప్పవని, ఎక్కడ పనిచేసినా నిబద్ధతతో సేవలు అందించి అందరి మన్ననలు అందుకోవాలని ఎంఈఓ కె.రవి ఆకాంక్షించారు. స్థానిక కమ్యూనిటీ వైద్యశాల ఇన్‌చార్జి డాక్టర్ సీహెచ్ రమేష్ సూళ్లూరుపేటకు, ప్రతిభాచౌదరి శ్రీకాళహస్తికి బదిలీ అయ్యారు. బుధవారం వారికి వైద్యశాల కమిటీ సభ్యులు, డాక్టర్లు, నర్సులు, సిబ్బంది, ప్రజలు వీడ్కోలు సన్మానం చేశారు. ఎంఈఓతోపాటు వైద్యశాల కమిటీ సభ్యుడు ఈ. గోవిందస్వామి డాక్టర్ల సేవలను ప్రస్తుతించారు. డాక్టర్ రమేష్ కరోనా సమయంలో సెలవు పెట్టకుండా రోగులకు సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎంఎస్.సురేష్, విద్యాసాగర్, దక్షిణామూర్తి చంద్రన్, హరి ప్రసాద్, నర్సులు జ్యోతి, తులసి, శశికళ, భారతి, హారిక, ఉష, వైద్యశాల కమిటీ మెంబర్లు మునికృష్ణయ్య, చిన్నబ్బ తదితరులు పాల్గొన్నారు.